# తడిసిన పంటలను కాపాడుకోండిలా..

**మిగ్‌జాం తుఫాన్‌తో పంటలకు నష్టం**

యాజమాన్య పద్ధతులతోనే నష్ట నివారణ తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయ నిపుణులు



**ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతులను తుఫాన్ ఆందోళనకు గురి చేస్తున్నది. పంటలు చేతి కొస్తున్న తరుణంలో మిగ్‌జాం తుఫాన్ తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని రైతుల్లో కలవరం మొదలైంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో వరి పంటలు కోత దశలో ఉండగా, కొన్ని చోట్ల కోతలు పూర్తయి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు ఉన్నాయి. కూలీల కొరతతో పత్తి మొక్కలపైనే ఉండగా.. మిరప కాత దశలో ఉన్నది. ఈ నేపథ్యంలో తుఫాన్‌తో పంటలు నష్టపోకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాన్ని నివారించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.**

– నేరేడుచర్ల, డిసెంబర్ 6

### వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షంలో తడిసిన గింజలు రంగు మారడం, సరిగా మొలకెత్తకపోవడం, మిల్లింగ్‌లో ఎక్కువ నూక రావడం, నాణ్యత తగ్గడంతోపాటు రేటు కూడా తగ్గుతుంది.
- ధాన్యం దెబ్బతినకుండా ఉండేందుకు పొలంలో నీరు నిలిచిన చోట కాల్వలు తీసి నీటిని బయటికి పంపాలి.
- ఒక వేళ వర్షం ఎక్కువై నీరు నిల్వ ఉంటే నాలుగైదు దుబ్బులు కలిపి నిలబెట్టి కట్టలు కట్టాలి. దీంతో వరి దుబ్బులు కిందపడకుండా ఉంటాయి.
- లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు కలిపి పడిపోయిన పైరుపై పిచికారీ చేసుకోవాలి. దాంతో గింజ రంగు మారడం తగ్గి మొలకెత్తకుండా ఉంటాయి.

### మిరప పంటలో చేపట్టాల్సిన చర్యలు..

- మిరప పంట ప్రస్తుతం కాయ దశలో ఉన్నది. మబ్బులతో కూడిన వాతావరణం వల్ల మిరప పంటను తెగుళ్లు అధికంగా ఆశించే అవకాశం ఉంటుంది. వర్షాలు అలాగే కురిస్తే కాయ కుళ్లు తెగులు, కొమ్మ ఎండు తెగులు ఉధృతి పెరిగే అవకాశం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.
- లీటరు నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1గ్రాము కార్బెండిజం కలిపి మొక్కల మొదల్లో పోయడం వల్ల ఎండు తెగులు తుగ్గుతుంది.
- కొమ్మ ఎండు తెగులు నివారణకు లీటరు నీటిలో ఒక గ్రాము ప్రొపికోనజోల్, డైఫెన్కజోల్, కాపర్ ఆక్సీక్లోరైడ్, కార్బెండిజం, మాంకోజెబ్ వంటి మందులు మోతాదు ప్రకారం మార్చి మార్చి పిచికారీ చేయాలి.
- బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోసైక్లిన్ మందులు కలిపి పిచికారీ చేయాలి.

### పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చేనుపై తడిసిన పత్తిని తీయకుండా ఎండిన తర్వాతనే ఏరాలి. ప్లాస్టిక్ పట్టాలపై మండెలుగా వేసి రెండు, మూడు రోజులు ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల పత్తిలో తేమ శాతం తగ్గి గింజ గట్టిపడి శుభ్రంగా ఉంటుంది.
- ఎనిమిది శాతం తేమ ఉన్న పత్తిని గోనె సంచుల్లో తొక్కి తేమ తగలని చోట నిల్వ చేయాలి. దీంతో పత్తి రంగు మారకుండా ఉండి ధర ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

పంటలు చేతికొస్తున్న తరుణంలో ముంచుకొస్తున్న తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వర్షం తగ్గిన తర్వాత మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. అవసరమైతే పంటల వద్దకు తీసుకెళ్లి వారి సలహాలు, సూచనల మేరకు మోతాదు ప్రకారం మందులు పిచికారీ చేయాలి.

**– దొంగరి నరేశ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి**

# 'భవిత'తో భరోసా..

**ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అండగా నిలుస్తున్న విద్యాశాఖ**

**వైకల్యం కలిగిన (ప్రత్యేక అవసరాలు గల) పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచి భరోసా కల్పిస్తున్నాయి భవిత సెంటర్స్. మానసిక, శారీరక, బహుళ వైకల్యం కలిగిన పిల్లలు పూర్వ స్థితికి వచ్చేలా శిక్షణ అందిస్తున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు పలు పరీక్షలు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఐఈఆర్‌పీలు.. ప్రతి సోమవారం ఫిజియోథెరపీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి భవిత సెంటర్లను బలోపేతం చేసి వైద్య సేవలతోపాటు విద్య అందించేలా కృషి చేస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 భవిత సెంటర్లు ఉండగా.. వాటిల్లో 8,350 మంది దివ్యాంగ చిన్నారులు సేవలు పొందుతున్నారు.**

– రామగిరి, డిసెంబర్ 6

**ప్రత్యేక శిక్షణతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చేయూత**

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 భవిత సెంటర్లు..**

**8,350 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలు**

**వైకల్యాన్ని జయించేలా, ఆత్మసైర్థ్యం పెంచేలా నిత్య పర్యవేక్షణలో 109 మంది ఐఈఆర్‌పీలు**

**సోమవారం నుంచి శుక్రవారం వరకు పలు పరీక్షలు**

**ప్రతి సోమవారం ప్రత్యేకంగా ఫిజియోథెరపీపై అవగాహన**

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు చికిత్స అందించి సాయం అందించేలా విద్యాశాఖ భవిత సెంటర్లను ఏర్పాటు చేసింది. వాటిల్లో మానసిక, శారీరక, బహుళ వైకల్యం కలిగిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ వైకల్యాన్ని తగ్గించేలా, ఆత్మసైర్థ్యం పెంచేలా తోడ్పడుతుంది. అదేవిధంగా ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) శిక్షణ ఇస్తారు. వీరితోపాటు ఫిజియోథెరపీ నిపుణులు ప్రతి సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించి భరోసా నింపుతుండటంతో భవిత సెంటర్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి.





నకిరేకల్ మండల కేంద్రంలోని భవిత సెంటర్

### ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు ఇలా..

నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు జిల్లా విద్యాశాఖ – సమగ్రశిక్ష ద్వారా తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని భవిత సెంటర్స్‌కు చెందిన ఐఈఆర్‌పీలు ఇంటింటికీ తిరిగి దివ్యాంగ పిల్లలను గుర్తిస్తారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వైకల్యం కలిగిన పిల్లలను భవిత సెంటర్స్‌కు తరలిస్తారు. చిన్నారులకు వైద్య సేవలతోపాటు విద్యను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు తరగతులు నిర్వహిస్తుండగా.. ప్రతి సోమవారం నిపుణులైన ఫిజియోథెరపిస్టులతో వైకల్యం గల పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తారు. అంతేకాకుండా మానసిక, శారీరక, బహుళ వైకల్యం కలిగిన పిల్లలకు ఐఈఆర్‌పీ, ఉపాధ్యాయులు శిక్షణ అందించి పూర్వ స్థితికి వచ్చేలా ఆత్మవిశ్వాసం కల్పిస్తూ భవితలో భరోసా అందిస్తున్నారు.

### వైకల్యం గల పిల్లల సంఖ్య...

| జిల్లా | భవిత సెంటర్లు | వైకల్యం గల పిల్లలు | ఐఈఆర్‌పీలు |
|---|---|---|---|
| నల్లగొండ | 52 | 3,338 | 50 |
| సూర్యాపేట | 28 | 2,900 | 34 |
| యాదాద్రి | 20 | 1,920 | 25 |
| మొత్తం | 100 | 8,350 | 109 |

### వైకల్యం కలిగే పిల్లలకు అందే సేవలు..

భవిత సెంటర్స్‌కు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రతి నెలా రూ.300 చొప్పున అలవెన్స్‌ను విద్యాశాఖ అందిస్తుంది. ఉచిత మెడికల్ క్యాంపుల ద్వారా చిన్నారుల అవసరాలకు అనుగుణంగా వైద్యుల సూచనతో మూడు చక్రాల సైకిళ్లు, రోలేటర్స్ ఉచితంగా అందిస్తారు. క్రమం తప్పకుండా భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సదరం సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకుంటారు. ఉచిత బస్‌పాసులు, రైల్వే పాస్‌లు సైతం అందిస్తారు.

### అందించే సేవలు

- జిల్లాలోని ప్రతి మండలంలో భవిత సెంటర్ ద్వారా పాఠశాల విద్యాశాఖ తరఫున ఉచిత శిక్షణ అందిస్తున్నారు.
- శస్త్ర చికిత్సలు సైతం ఉచితంగానే అందిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత సెంటర్స్‌కు పంపించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.
- ప్రతి భవిత సెంటర్‌లో నిపుణులైన ఇద్దరు ఫిజియోథెరపిస్టులు పనిచేస్తూ వైద్య పరీక్షలు, శిక్షణ అందిస్తున్నారు.
- భవిత సెంటర్స్‌లో కేర్‌టేకర్స్‌తోపాటు విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ పర్యవేక్షణ ఉంటాయి.
- ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ టీచర్)కు కేటాయించిన పాఠశాలకు వెళ్లి అక్కడ వైకల్యం కలిగిన పిల్లలను పరిశీలించి వారి పరిస్థితిని గుర్తిస్తారు. అభ్యసన ప్రవర్తన గురించి సంబంధిత ఉపాధ్యాయుల నుంచి తెలుసుకుంటారు.
- సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐఈఆర్‌పీలు భవిత సెంటర్స్‌లో శిక్షణ అందిస్తారు. శనివారం పాఠశాలకు రాలేని దివ్యాంగ చిన్నారుల ఇండ్లకు వెళ్లి శిక్షణ ఇస్తారు.
- ఇంటి వద్దనే పిల్లలకు ఐఈఆర్‌పీలు ఫిజియోథెరపీతోపాటు స్పీచ్ థెరపీ చేయిస్తూ మానసిక దివ్యాంగులకు అర్థమయ్యే రీతిలో చదువు నేర్పిస్తారు. మరో వైపు ప్రత్యేక ఉపకరణాల ద్వారా ఆటాపాటలతో మెళకువలు నేర్పుతారు.



కొండమల్లేపల్లిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

### వైకల్యం గల పిల్లల భవిష్యత్‌కు భరోసా



విద్యాశాఖ – సమగ్రశిక్ష ఆధ్వర్యంలో భవిత సెంటర్స్‌కు తీసుకొచ్చే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు భరోసా కల్పించేలా నిబంధనల మేరకు శిక్షణ అందిస్తున్నాం. డీఈఓ సూచనలు, ఆదేశాలను పాటిస్తూ ఐఈఆర్‌పీలు జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలలు, వాటి పరిధిలో పర్యవేక్షణ చేస్తూ వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలకు తీసుకొస్తారు. వారికి ఫిజియోథెరపిస్టులతో అవసరమైన శిక్షణ అందించి ఆత్మసైర్థ్యం కల్పిస్తున్నారు. వైకల్యాన్ని బట్టి సదరం సర్టిఫికెట్ కోసం పంపిస్తాం. మరోవైపు వైకల్యం ఉన్న పిల్లలకు బస్, రైల్ పాసులు ఇప్పిస్తున్నాం. వీరికి ప్రభుత్వం ఉద్యోగాల్లో 4శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 52 భవిత కేంద్రాల్లో 50మంది ఐఈఆర్‌పీలు సేవలందిస్తున్నారు.

**– వంగూరి వీరయ్య, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్, సమగ్రశిక్ష – నల్లగొండ**

### ఆత్మస్థైర్యం పెంచుతున్నాం



ప్రత్యేక అవసరాలు గల పిల్లలను నిత్యం సందర్శించి వారిలో నైపుణ్యాలు పెంచి ఆత్మసైర్థ్యం పెంపొందేలా కృషి చేస్తున్నాం. దివ్యాంగ బాల, బాలికలకు మేలైన సేవలందిస్తూ విద్యాశాఖ లక్ష్యాన్ని చేరేలా పనిచేస్తున్నాం. భవిత కేంద్రాలకు రాని పిల్లల ఇంటికి ప్రతి శనివారం వెళ్లి సేవలందిస్తూ తల్లిదండ్రులు, పిల్లల్లో భరోసా కల్పిస్తున్నాం. భవిత సెంటర్లకు వచ్చే పిల్లలకు ఫిజియోథెరపిస్టులు శిక్షణ ఇచ్చి ప్రాక్టీస్ చేసేలా చూపిస్తున్నారు. దాంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో మానసిక ధైర్యం కలుగడంతోపాటు మార్పు వస్తున్నది.

**– శ్రీనివాస్, ఐఈఆర్‌పీ, నకిరేకల్ మండలం, నల్లగొండ జిల్లా**



నార్కట్‌పల్లి భవిత సెంటర్‌లో పరీక్షలు చేస్తున్న డాక్టర్, పిల్లలతో తల్లిదండ్రులు, ఐఈఆర్‌పీలు



# వరి వద్దు.. ఇతర పంటలు మేలు

**నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలి**

**యాసంగిలో వరి కంటే ఇతర పంటల సాగు మేలు**

**పంట మార్పిడితో చీడపీడలను అరికట్టవచ్చు**

**గడ్డిపల్లి కేవీకే మృత్తికా శాస్త్రవేత్త దొంగరి నరేశ్**

గరిడేపల్లి, డిసెంబర్ 6 : ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేని కారణంగా యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవడమే మేలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రైతులు తమకున్న కొద్ది మేర నీటి వనరులను ఉపయోగించుకుంటూ నేల రకాన్ని బట్టి ఆరుతడి పంటలను సాగు చేస్తే మంచి ఫలితాలను సాధించవచ్చని తెలుపుతున్నారు. అయితే.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎర్రనేలలు, నల్లరేగడి, ఇసుక, రాతి నేలలు ఉన్నాయి. రైతులు తమ భూమిలో ఆరు తడి పంటల్లో ఏదో ఒకటి అన్నట్టు కాకుండా నేలల రకానికి అనుగుణంగా పంటలను సాగు చేయాలి. వాటిలో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని గడ్డిపల్లి కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ దొంగరి నరేశ్ సూచిస్తున్నారు. పంటల సాగులో నేల రకమే కీలకమని, దానికి అనుగుణంగా పంటలను ఎంచుకుని సాగు చేయాలని తెలిపారు. ఏ నేలలో ఏ రకాలను సాగు చేయాలనే విషయాలను ఆయన వివరించారు. అదనపు సమాచారం కోసం 9290615952 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

**వేరుశనగ :** యాసంగిలో జనవరి చివరి వరకు వేసుకోవచ్చు. గరప, నీరు త్వరగా ఇంకే ఎర్ర చెల్క నేలలు అనువైనవి. 100 – 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. అనువైన విత్తన రకాలు : కదిరి 6, 7, 8, 9, కదిరి హరితాంధ్ర, ఐసీజీవీ – 91114, ధరణి, కదిరి లేపాక్షి (కే–1812)

**చెరుకు :** డిసెంబర్ నుంచి మార్చి వరకు నాటుకోవచ్చు. చౌడు భూముల్లో నాటుకునే వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. నీటి సదుపాయం కలిగిన నల్లరేగడి, ఒండ్రు, మెరక భూములు అనువైనవి.

**అనువైన విత్తన రకాలు :** కో– 6907, కో–8014, కో–94008, కో–419, కో–811, కో, ఆర్ – 8001

**నువ్వులు :** మురుగు నీరు నిల్వని తేలికైన నేలలు శ్రేష్టం. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాలు గల నేలలు పనికిరావు.

విత్తే సమయం : జనవరి రెండో పక్షం నుంచి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. 85– 90 రోజుల్లో పంట కోతకు వస్తుంది.

**విత్తన రకాలు :** శ్వేత, రాజేశ్వరి, చందన, గౌరీ.

**పొద్దుతిరుగుడు :** నీరు నిల్వ ఉండని ఎర్ర చెల్క, ఇసుక, రేగడి, ఒండ్రు నేలలు శ్రేష్టమైనవి. అంతర పంటగా 4 ః 2 నిష్పత్తిలో వేరుశనగ + పొద్దుతిరుగుడు, 1 ః 2 నిష్పత్తిలో కంది + పొద్దు తిరుగుడు సాగు చేయవచ్చు. ఎకరానికి 2.5 – 3 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. పంట కాలం 90 – 95 రోజులు. దిగుబడి 5 – 6 క్వింటాళ్లు.

**విత్తన రకాలు :** కేబీఎస్‌హెచ్– 44, ఎన్‌డీఎస్‌హెచ్–1, డీఆర్‌ఎస్‌హెచ్–1.

**ఆముదం :** దీని పంటకాలం 120 నుంచి 140 రోజులు. యాసంగిలో అక్టోబర్ రెండో పక్షంలో విత్తుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు. ఆముదం + కంది 1 ః 1 నిష్పత్తిలో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 2 – 2.5 కిలోల విత్తనాలు అవసరమవుతాయి.

**ఆవాలు :** మోస్తరు బరువైన నేలలు మంచి దిగుబడులను ఇస్తాయి. తేలికపాటి నేలలు, నల్లరేగడి, ఒండ్రు నేలల్లో కూడా పండించవచ్చు. ఎకరానికి 2 – 2.5 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. పంట కాలం 120 – 125 రోజులు, విత్తన రకాలు : పూసా అగ్రాని, వరుణ, పూసా మహల్, నరేంద్ర


**కుసుమ :** యాసంగి పంటగా దీనిని నాటుకోవచ్చు. నీరు నిల్వని బరువైన తేమ నిలుపుకొనే నల్లరేగడి, నీటి వసతి గల ఎర్ర గరప నేలలు అనుకూలం. 125 – 130 రోజుల పంటకాలం. 4 కిలోల విత్తనాలు ఎకరానికి అవసరమవుతాయి.

**మొక్కజొన్న :** నీరు ఇంకే నల్లరేగడి, ఎర్ర నేలలు, ఒండ్రు, ఇసుక నేలలు అనుకూలమైనవి. మొక్కజొన్నను యాసంగిలో నవంబర్ మూడో వారం వరకు విత్తుకోవచ్చు. పంట కాలం 105 – 120 రోజులు. 8 కిలోల విత్తనాలు ఎకరానికి అవసరమవుతాయి.

**విత్తన రకాలు :** డీహెచ్‌ఎం–1, డీహెచ్‌ఎం– 103, డీహెచ్‌ఎం– 107.

**జొన్న :** నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు ఈ పంట సాగుకు అనుకూలం. పంట కాలం 110– 115 రోజులు. ఎకరానికి 3– 4 కిలోల విత్తనాలు అవసరమవుతాయి.

**విత్తన రకాలు :** సీఎస్‌హెచ్– 13, సీఎస్‌హెచ్– 16, సీఎస్‌హెచ్– 14, పీఎస్‌వీ–1



**అలసంద :** నల్లరేగడి, ఎర్రనేలలు, నీరు నిల్వని నేలలు అనుకూలం. యాసంగి పంటగా ఫిబ్రవరి వరకు నాటుకోవచ్చు. పంట కాలం 110 రోజులు. ఎకరానికి 8– 10 కిలోల విత్తనాలు అవసరం. పశుగ్రాసంగా, పచ్చిరొట్టగా వేస్తే 12– 14 కిలోల విత్తనాలు అవసరం.

**విత్తన రకాలు :** జీసీ– 3, వీ– 240, సీ– 152.

కంది : యాసంగిలో స్వల్పకాలిక రకాలు సాగు చేయవచ్చు. నల్లరేగడి, ఎర్రచెల్క నేలలు అనుకూలం. 120 – 130 రోజుల పంటకాలం.

**విత్తన రకాలు :** ఎల్‌ఆర్‌జీ – 41, లక్ష్మి ఐసీపీఎల్– 85063, మారుతీ ఐసీపీ– 8863

**పెసర, మినుము :** వానకాలం వరి తర్వాత 15 నవంబర్ నుంచి డిసెంబర్ మొదటి వారం వరకు విత్తుకోవచ్చు. తేమను పట్టి ఉంచే అన్ని రకాల భూముల్లో సాగు చేసుకోవచ్చు. మినుము సాగుకు అత్యంత బరువైన నల్లరేగడి నేలలు అనుకూలం. పెసర 60 – 65 రోజుల్లో పంట కోతకు వస్తుంది. మినుము 70– 80 రోజుల్లో కోతకు వస్తుంది.

పెసర : డబ్ల్యూజీజీ – 37 (ఏకశిల), ఎజీజీ – 347, (మాదిర పెసర)

**మినుము :** ఎల్‌బీజీ – 752, ఎల్‌బీజీ – 20, ఎల్‌బీజీ – 26 పీయూ– 31

### నేల స్వభావం.. అనువైన పంటలు

- నీటి సౌకర్యం కలిగిన ఎర్రనేలల్లో వేరుశనగ, ఆముదం, పొద్దు తిరుగుడు, కంది, మినుము, అలసంద, జొన్న, మొక్కజొన్న, కుసుమ, నువ్వుల సాగు అనుకూలం.
- నీటి సౌకర్యం కలిగిన నల్లరేగడి నేలల్లో ఆముదం, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, పెసర, మినుము, నువ్వులు వేయవచ్చు.
- వర్షాధారపు ఎర్రనేలల్లో ఉలువలు, జొన్నలు, వర్షాధారపు నల్లరేగడి నేలల్లో శనగ, ఆవాలు, కుసుమ పంటలు వేస్తే మంచిది.

### ఆరుతడి పంటలతోనే రైతులకు మేలు



ప్రస్తుత పరిస్థితిలో యాసంగిలో ఆరు తడి పంటల సాగుతోనే రైతుకు మేలు జరుగుతుంది. ఆరుతడి పంటలుగా ఒకే పంటను కాకుండా అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతు నికర ఆదాయం పెరుగుతుంది. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోకుండా ఉంటాయి. పప్పు దినుసులు సాగు చేస్తే వాటి మొక్కల వేర్లు గాలిలోని నత్రజనిని స్థిరీకరించి భూసారం పెరుగుతుంది. ఉపయోగకర సూక్ష్మజీవుల సంఖ్య సైతం పెరుగుతుంది. నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను బట్టి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే రైతులు ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు అధిక లాభాలు పొందవచ్చు.

**– దొంగరి నరేశ్, కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కో ఆర్డినేటర్, గడ్డిపల్లి**